## ప్రజలకు అండగా 'సాక్షి'

కార్పొరేషన్ కమిషనర్‌తో నేడు 'ఫోన్ ఇన్'



కె.సుజాత, కమిషనర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, విష జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకునేలా 'సాక్షి'ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా కేఎంసీ పరిధిలోని ప్రజలు సీజనల్ వ్యాధుల కట్టడికి చేయాల్సిన పనులు, ఓపెన్ ప్లాట్లలో చెత్త నిల్వలు, డ్రెయినేజీలు, రోడ్లు సరిగ్గా లేకపోవడం తదితర సమస్యలను కమిషనర్ కె.సుజాత దృష్టికి తీసుకెళ్లవచ్చు.

తేదీ : 18 - 07 - 2025, శుక్రవారం

సమయం : ఉదయం 10 - 11 గంటలు

ఫోన్ చేయాల్సిన నంబర్లు :

**9849905882, 9949702944**

# ఏరియా వర్క్‌షాపులో సమస్యలు తిష్ట

- నెలల తరబడి జరగని సేఫ్టీ కమిటీ మీటింగ్‌లు
- ప్రాధాన్యం లేని గుర్తింపు సంఘం
- కార్మికులకు రక్షణపై కొరవడిన అవగాహన



వర్క్‌షాపు డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం సింగరేణి ఏరియా పరిధిలోని వీకే వర్క్‌షాపు సమస్యలకు నిలయంగా మారింది. వర్క్‌షాపులో ఎన్నో ఏళ్లుగా టిండాల్ సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ, భర్తీ చేసేందుకు యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని, చాలాకాలంగా పనిచేస్తూ అర్హత కలిగిన వారితో ఆ పోస్టులు భర్తీ చేయాలని కార్మికులు కోరుతున్నారు.

కొత్తగూడెం ఏరియాకు ఆయువు పట్టు అయిన సత్తుపల్లిలో అత్యధిక ఉత్పత్తి వస్తున్న నేపథ్యంలో ఏర్పడుతున్న ఎరక్షన్, ఆల్ట్రేషన్ పనులకు వర్క్‌షాపు నుంచి కార్మికులను సత్తుపల్లికి పంపుతున్నారు. కానీ వారికి సరైన ట్రాన్స్‌పోర్ట్ కల్పించటంలో యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తోందని, అధికారులకు అన్ని సౌకర్యాలు ఉన్న వాహనాలు కల్పిస్తున్న సంస్థ.. కష్టపడి పనిచేసే కార్మికులకు కల్పించటంలో నిర్లక్ష్యం చేస్తుందని వాపోతున్నారు. ఫలితంగా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, 60 కిలోమీటర్ల దూర ప్రయాణంతో అసౌకర్యం కలుగుతోందని, కొన్ని సమయాల్లో అనారోగ్యాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**క్యాంటీన్ కూడా లేక...**

వీకే వర్క్‌షాప్‌లో 120 మంది పర్మనెంట్, 100 మంది అప్రెంటిస్ అభ్యర్థులు, మరికొంత మంది అవుట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. కానీ ఇక్కడ బైక్ స్టాండ్, ఆర్వో ప్లాంట్ లేకపోగా.. కనీసం క్యాంటీన్ సౌకర్యం కూడా లేకపోవడం గమనార్హం. ఇతర జబ్బులతో పిట్ ఫర్ సర్ఫేస్‌గా మారిన వయోభారం కలిగిన కార్మికులపై పనిభారం తగ్గించాలని, బరువుగల వస్తువులను ఎత్తటానికి ఫోర్క్ లిఫ్టర్‌ను అన్ని శాఖలకు సమకూర్చాలని కార్మికులకు కోరుతున్నారు. అదేవిధంగా ప్రతీనెల సేఫ్టీ కమిటీలు నిర్వహించాలని, క్యాంటీన్ సౌకర్యాన్ని కాంట్రాక్ట్ కార్మికులకు, డీఎల్ఆర్ కార్మికులకు కూడా కల్పించాలని కోరారు. ఉద్యోగ విరమణ చేస్తున్న కార్మికుల స్థానంలో వెంటనే భర్తీ చేయాలనా కోరుతున్నారు.

### సేఫ్టీ కమిటీలు నిర్వహించడం లేదు..



వర్క్‌షాపులో ప్రతీనెల సేఫ్టీ కమిటీ మీటింగ్ జరుగాల్సి ఉంది. కొంతకాలంగా జరగడం లేదు. గుర్తింపు సంఘానికి సరైన ప్రాధాన్యం లేదు. ఫలితంగా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. కార్మికులకు రక్షణపై అవగాహన కొరవడింది. టూల్స్, కార్మికులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించని కారణంగా పెండింగ్‌లో ఉన్నాయి.

– టీఎస్ పవన్‌కుమార్, చీఫ్ ఆర్గనైజేషన్ సెక్రటరీ

### క్యాంటీన్ ఏర్పాటుకు చర్చించాం..



ఏరియా వర్క్‌షాపుకు సమీపంలో జీఎం కార్యాలయం, ఎంవీటీసీ, ఏరియా స్టోర్స్, సీహెచ్‌పీలు ఏర్పాటవుతున్న నేపథ్యంలో సెంట్రల్ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని స్ట్రక్చరల్ సమావేశంలో చర్చించాము. గుర్తింపు సంఘంగా ఏరియా అధికారులకు వినతిపత్రం అందజేసినప్పటికీ, వర్క్‌షాపులో క్యాంటీన్ ఏర్పాటు చేయడం లేదు.

– మధుకృష్ణ, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ

### ఖాళీ స్థానాలు భర్తీ చేయాలి



వర్క్‌షాపులో ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానాలు భర్తీ చేయకపోవడంతో ఉన్నవారిపై పనిభారం పడుతోంది. అంతేకాకుండా వివిధ కారణాలలో పిట్‌ఫర్ సర్ఫేస్‌గా ఎంపికైన వారికి కూడా యాజమాన్యం పనిభారం పడకుండా లైట్‌జాబ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రధానంగా టెక్నీషియన్లు, జనరల్ అసిస్టెంట్లు తక్కువగా ఉన్నారు.

– రాంచందర్, ఫిట్టర్, ఏరియా వర్క్‌షాపు

## వానరాలు వనంలోకి వెళ్లాలి



అటవీశాఖ అధికారులతో కలిసి మొక్క నాటుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: కోతులు వనంలోకి వెళ్లేలా అటవీ శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని, దీనికోసం తాజాగా అటవీ ప్రాంతంలో నాటే మొక్కలలో అత్యధికంగా ఫలాలనిచ్చే వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని చెక్‌పోస్టు రొంపేడు సమీపంలో గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. స్థానికులు, అటవీశాఖ అధికారులు, ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి మంత్రి సీతక్క మొక్కలు నాటారు.

మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా వేసవిలో వర్షాలు కురవడం, వర్షాకాలంలో ఎండలు మండిపోవడం వంటి పరిణామాలు వాతావరణ సమతుల్యత వల్లే సంభవిస్తున్నాయని గుర్తుచేశారు. వీటిని అధిగమించేందుకు ప్రతీఒక్కరు వనాల వృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ కృష్ణగౌడ్, ఎఫ్‌డీఓ కరుణాకరాచారి, ఎఫ్ఆర్ఓ చలపతిరావు, మాజీ ఎంపీటీసీ తాటి యశోద, మాజీ ఉపసర్పంచ్ తాటి రాంబాబు, రొంపేడు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

## గ్రౌండ్‌ను మున్సిపాలిటీకి అప్పగించండి..



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న మడత వెంకట్‌గౌడ్

ఇల్లెందు: ఇల్లెందు ప్రజల అవసరాలకు ఫారెస్టు గ్రౌండ్‌ను మున్సిపాలిటీకి అప్పగించాలని మంత్రి సీతక్కను మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ కోరారు. దసరా పండుగ నిర్వహించటానికి పట్టణ ప్రజలకు గ్రౌండ్ లేక ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, వాకింగ్ ట్రాక్‌లతో పాటు వివిధ పార్టీలు సభలు సమావేశాలు జరుపుకునే గ్రౌండ్‌ను కోర్టుకు అప్పగించారని కోరారు. ఇల్లెందు పట్టణానికి రెండు కోర్టులు ఉన్న క్రమంలో ఈ స్థలం కేటాయించారని, ఒక కోర్టు మరో ప్రాంతానికి తరలి వెళ్లినందున గ్రౌండ్ గత నాలుగేళ్లుగా పడావుపడి ఉంటుందని తక్షణమే మున్సిపాలిటీకి అప్పగించాలని కోరారు. రాజు, మునాఫ్, కిరణ్, అరుణ్, జానీ, సదానందం, గోపీ ఉన్నారు.

**కొమరారం, బోడు మండలాల కోసం..**

ఇల్లెందు నియోజకవర్గంలో కొమరారం, బోడు కొత్త మండలాలతో పాటు ఇల్లెందు కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలని ఎన్డీ రాష్ట్ర నాయకులు మధు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. ఇదిలా ఉండగా మున్సిపల్, గ్రామపంచాయతీ వర్కర్లను పర్మనెంట్ చేయాలని ఎన్డీ అనుబంధ ఇఫ్టూ యూనియన్ నాయకులు సారంగపాణి, డి.ప్రసాద్‌లు కోరారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, ఐకేపీ ఉద్యోగుల రెండు క్యాడర్ల పెంపు, ఉద్యోగ నియామక పత్రాలు అందజేత, గ్రామ సంఘాల సహాయకుల వేతనాలు పెంచాలని మంత్రి సీతక్కకు సెర్ప్ ఉద్యోగులు ఇల్లెందు ఏపీఎం దుర్గారావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

**ఎమ్మెల్యే ఇంటికి..**

టేకులపల్లి: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) గురువారం రాత్రి టేకులపల్లి మండలం కోయగూడెంలోని ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇంటిని సందర్శించారు. ఎమ్మెల్యే సతీమణి లక్ష్మి, మాజీ సర్పంచ్ కోరం ఉమతో పాటు నాయకులు బొకే ఇచ్చి ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. పలువురు నాయకులు మంత్రిని శాలువాతో సన్మానించారు.

## క్లుప్తంగా

### శ్రీరామచంద్ర కళాశాలలో బోనాల సంబురాలు



బోనాలతో విద్యార్థినులు, అధ్యాపకులు

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో గురువారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు కలిసి బోనాలతో కళాశాల ఆవరణలో ప్రదర్శన చేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగ సంబురా లు ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.

### జనాభా ప్రాతిపదికన పదవులు కేటాయించాలి



రామచందర్‌రావుకు బొకే అందజేస్తున్న పూన్యానాయక్

టేకులపల్లి: బీజేపీ ఇల్లెందు నియోజకవర్గ నాయకుడు బోడ పూన్యా నాయక్, మాజీ మంత్రి అమర్సింగ్ తిలావత్‌తో కలిసి గురువారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును హైదరాబాద్‌లో కలిసి శాలువాతో సన్మానించి, బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అన్నివర్గాల వారిని పరిగణలోకి తీసుకుని జనాభా ప్రాతిపదికన పార్టీ పదవుల్లో స్థానం కల్పించాలని కోరారు. చిక్క వెంకటేశ్వర్లు, నెల్లూరి సత్యం, గుగులోత్ నాగేందర్, బానోత్ పంతులు, బోడ సురేష్ పాల్గొన్నారు.

### 'పోడు'పై దాడులు ఆపాలి

కొత్తగూడెంటౌన్: గిరిజన రైతులపై అటవీ అధికారుల దాడులు సమంజసం కాదని భద్రాద్రి సేవాలాల్ సేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బానోతు శ్రీనివాస్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రబోడు పోడు రైతులపై జరిగిన దాడి హేయమైన చర్య అని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆదివాసీ ప్రజలకు రక్షణ కరువైందని, ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ హక్కుల చట్టాన్ని కారేపల్లి ఆటవీ రేంజ్ సెక్షన్ అధికారులు, బీట్ ఆఫీసర్లు ఉల్లంఘించారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు పోడు రైతుల పట్ల దాడులు నిలిపివేయాలని విన్నవించారు.

### వెంకటేశ్వర్లుకు నివాళి

సుజాతనగర్: తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ చప్పిడి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన స్వస్థలమైన సింగభూపాలెం గ్రామంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, లిక్కి బాలరాజు, కున్సోత్ ధర్మా, వీర్ల రమేష్, కాట్రాల తిరుపతిరావు, కాలంగి హరికృష్ణ, కోటేశ్వరరావు, సుందర్ వెంకటేశ్వర్లు మృతదేహంపై పూలు ఉంచి నివాళులర్పించారు.

### నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: మైనారిటీ సంక్షేమ శాఖ పరిధి మైనారిటీ స్టడీ సర్కిల్ వారు నిరుద్యోగ మైనారిటీ యువతకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీస్, ఇన్సూరెన్స్ రంగాల్లో ఉచిత శిక్షణ, ఉపాధి పథకానికి అర్హులైన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా గురువారం ఒక ప్రకటనలో కోరారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



బద్దుతండాలో మాట్లాడుతున్న హరిప్రియ

టేకులపల్లి: రాబోయే స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపొంది బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో టేకులపల్లి మండలం బద్దుతండ గ్రామపంచాయతీలో పలు గ్రామాలలో పర్యటించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలపై ఆరా తీసి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా హామీలను నెరవేర్చక ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలని కార్యకర్తలను సూచించారు. మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బోడ బాలు, బానోతు కిషన్, లాలు, ఆమెడ రేణుక, బాదావత్ దినేష్ దితరులు పాల్గొన్నారు.

## ఎర్రబోరులో జ్వరాలు

పాల్వంచరూరల్: ఆదివాసీల నివాస గ్రామమైన దంతలబోరు పంచాయతీ ఎర్రబోరులో గురువారం పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. మడివి రోహిత్‌కు మూడురోజులుగా జ్వరంతో బాధపడుతుండంతో తల్లిదండ్రులు జగన్నాథపురం పీహెచ్‌సీకి తీసుకెళ్లగా డాక్టర్ రాజు టైఫాయిడ్ జ్వరం వచ్చినట్లు నిర్ధారణ చేశారని బాలుడి తండ్రి తెలిపారు. అదేవిధంగా గ్రామంలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్నామని పలువురు బాధితులు తెలిపారు. ఈ విషయమై డాక్టర్ రాజును వివరణ కోరగా.. కలుషిత ఆహారం, నీరు తీసుకున్నప్పుడు టైఫాయిడ్ జ్వరం వస్తుందని, గ్రామంలో ఇంటింటికీ తిరిగి ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేసి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

## వాటర్ కూలర్ వితరణ..



కూలర్ అందజేస్తున్న లక్ష్మారెడ్డి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బార్ అసోసియేషన్‌కు సీనియర్ న్యాయవాది కె.లక్ష్మారెడ్డి గురువారం వాటర్ కూలర్‌ను వితరణ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు జె.గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి భాగం మాధవరావు, ఉప కార్యదర్శి కాసాని రమేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఎరువుల స్టాక్ పాయింట్ తనిఖీ

పాల్వంచ: పాల్వంచ సొసైటీ ఎరువుల స్టాక్ పాయింట్‌ను జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.బాబూరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ వివరాలు, యూరియా అందించే తీరును ఏఓ శంకర్, ఏఈఓ భువనేశ్వరీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సొసైటీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ... యూరియా రైతులకు సరిపడా ఉందని, రైతులు వేసిన పంటలకు ఎరువులను కొనుగోలు చేయాలని, నిల్వ చేయరాదన్నారు. బ్లాక్ మార్కెటింగ్ చేస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కార్మికుల సదస్సును జయప్రదం చేయండి..





కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: ఆగస్టు 1న టేకులపల్లిలో భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ టేకులపల్లి ఏరియా కార్యదర్శి డి.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం పెట్రాంచలకలో కార్మికులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. మాట్లాడుతూ...

ప్రభుత్వం భవన ఇతర నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, రూ.9వేల పింఛన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈసం కార్తీక్, భద్రయ్య, లక్ష్మీనర్సు, ముచ్చరాజు, పెనక సత్యనారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్‌యూ ఆందోళన



ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

ఇల్లెందు: పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం విద్యార్థులు పలు పాఠశాలల ఎదుట ఆందోళన నిర్వహించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఎంఈఓ, డీఈఓ పోస్టులు, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల ఎదుట విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు బి.సాయి, గణేష్, అబ్దుల్ ఘనీ, మహేష్, శ్రావణి, భార్గవి, కీర్తికా, సింధు, ఇందు, శ్వేత, నవ్య, దివ్య పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతంలో విత్తనాలు చల్లిన విద్యార్థులు



విత్తనాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సింగరేణి(కొత్తగూడెం): కలెక్టర్ స్ఫూర్తితో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విత్తనాలను సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం కార్మిక ప్రాంతమైన రామవరంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కొత్తగూడెం మండలంలో సేకరించిన సుమారు 40 కేజీల గానుగ, వేప, టేకు, తదితర గింజలను మండల విద్యాశాఖాధికారి డాక్టర్ ప్రభుదయాళ్ నేతృత్వంలో ఎన్‌సీసీ విద్యార్థులు రామవరం రిజర్వ్ అటవీ ప్రాంతంలో చల్లారు. ఈ కార్యకమంలో ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ ఆఫీసర్ వీరు, లక్ష్మి, ఉపాధ్యాయులు రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## యూరియా కొరతను నివారించాలి



తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఇల్లెందురూరల్: విక్రయ కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

జూలూరుపాడు: రైతులకు ఏర్పడిన యూరియా కొరతను నివారించాలని కోరుతూ ఏఐకేఎంఎస్ – సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. వల్లోజి రమేష్ మాట్లాడుతూ.. రైతులు పంటల సాగుకు సరిపడా యూరియా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. వానాకాలం పంటలు సాగు చేసిన రైతులు ఒకవైపు వర్షాలకు కోసం ఎదురు చూడాల్సి వస్తుండగా, మరోవైపు పంట ఎదుగుదలకు యూరియా లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని వాపోయారు. ఆరుగాలం శ్రమించే రైతు అష్టకష్టాలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల కోసం క్యూలైన్‌లో రైతులు నిలబడాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న యూరియా కొరత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కూరాకుల నరసింహారావు, కొండపనేని సత్యనారాయణ, బత్తుల గోపి, జవ్వాది నరసింహారావు పాల్గొన్నారు.

టేకులపల్లి: యూరియా కొరతను నివారించాలని ఏఐటీకేఎంఎస్ మండల కార్యదర్శి ఎట్టి నరసింహారావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం బోడు గ్రామంలో నిరసన తెలియజేశారు. అనంతరం టేకులపల్లి తహసీల్దార్ వీరభద్రానికి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. యూరియా లేకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భూక్యా హర్ష, నర్సింగ్, ధరావత్ వెంకన్న, మంగీలాల్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: రైతుల అవసరం మేర యూరియా విక్రయాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం యూరియా విక్రయ కేంద్రం వద్ద రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు మాట్లాడుతూ.. పంటలు ఏపుగా పెరుగుతున్న వేళ రైతులకు అవసరమైన యూరియా సకాలంలో సరఫరా చేయాల్సిన ప్రభుత్వం కొరత పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. రైతు ప్రభుత్వమని చెపుకుంటున్న అమాత్యులు రైతుల అవసరాలను తీర్చలేకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో డి.ప్రసాద్, తుపాకుల నాగేశ్వరరావు, ఆజ్మీర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు యూరియా దూరమేనా..?



సొసైటీ కార్యాలయానికి యూరియా కోసం భారీగా తరలివచ్చిన రైతులు

ఇల్లెందురూరల్: భూమిలేని రైతులు బతుకు దెరువు కోసం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. వీరికి అటు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందక.. ఇటు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు కాక ఆర్థిక ఇబ్బందులతో నెట్టుకొస్తున్నారు. తాజాగా పంటలకు యూరియా కొనుగోలు విషయంలోనూ కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరితోపాటు పాస్‌పుస్తకాల లేని రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఇల్లెందుకు 1,359 మెట్రిక్ టన్నులు...**

ప్రస్తుత వానాకాలం సీజన్‌కు ఇల్లెందు పీఏసీఎస్ ఆధ్వర్యంలో జూన్ నుంచి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో విక్రయాలు ప్రారంభించారు. ఇదిలా ఉండగా ఈ సీజన్‌కు మండలంలో సాగు విస్తీర్ణం ఆధారంగా 4,200 మెట్రిక్ టన్నుల యూరియా కావాలని వ్యవసాయశాఖ అధికారులు నిర్ణయించారు. కానీ ఇప్పటి వరకు 1,359 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. ఇందులో పీఏసీఎస్‌కు 759, ప్రైవేటు వ్యాపారులకు 600 మెట్రిక్ టన్నులు సరఫరా జరిగినట్లు ఈనెల 16వ తేదీ వరకు ప్రభుత్వ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

**రద్దీతో నిబంధనల్లో మార్పు...**

యూరియా విక్రయం ప్రారంభంలో రైతులకు ఒక్కో ఆధార్ కార్డుకు 5 బస్తాలు చొప్పున విక్రయించారు. కానీ విక్రయ కేంద్రం వద్ద రద్దీ మరింతగా పెరగడంతో నిబంధనల్లో మార్పు చేస్తూ పీఏసీఎస్, వ్యవసాయ శాఖల అధికారులు నిర్ణయించారు. దీనిప్రకారం ఆధార్‌కార్డుతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ పత్రాలు వెంట తెచ్చుకుంటేనే యూరియా విక్రయిసామని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం నుంచే ప్రచారం కల్పించారు.

**వేల సంఖ్యలో భూమి పట్టాలు లేని రైతులు..**

భూమి లేని వారు కౌలుకు తీసుకొని వివిధ పంటలు సాగు చేస్తుంటారు. ఇలాంటి రైతుల వద్ద పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉండవు. యజమాని తాను సాగు చేసే భూమి కోసం పట్టాదారు పాస్‌పుస్తకాలు చూపించి యూరియా తీసుకెళ్లడంతో కౌలు రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అంతేకాకుండా గతంలో భూరికార్డుల శుద్ధీకరణ సమయంలో అటవీ, రెవెన్యూ భూములకు సరిహద్దులు విషయంలో వివాదం తలెత్తడంతో రాఘబోయినగూడెం, రొంపేడు, కొమరారం ప్రాంతాలలో, సీలింగ్ భూముల వివాదంతో మామిడిగుండాల ప్రాంతంలో వేల ఎకరాల్లో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందలేదు. తాజాగా అధికారులు విధించిన నిబంధన ప్రకారం ఇటువంటి రైతులంతా ప్రభుత్వ విక్రయ కేంద్రం వద్ద యూరియా కొనుగోలుకు అనర్హులయ్యారు. ఇదిలా ఉండగా యూరియా కోసం విక్రయ కేంద్రానికి వచ్చిన కౌలు రైతులు, అర్హత ఉన్నా గతంలో పట్టాదారు పాస్‌పుస్తకాలు అందని రైతులు గురువారం ఉట్టి చేతులతో ఇంటిముఖం పట్టారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని యూరియా కొనుగోలుకు పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ అందజేయాలన్న నిబంధన సడలించాలని, లేదంటే తాము పంటలు సాగు చేస్తున్నట్లుగా వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేకంగా గుర్తించి ధృవీకరణ పత్రం జారీ చేయాలని రైతులు వేడుకుంటున్నారు. ఇదే విషయమై ఏడీఏ లాల్‌చంద్‌ను వివరణ కోరగా.. ఇల్లెందు విక్రయ కేంద్రానికి ఇతర మండలాల నుంచి రైతుల రద్దీని నియంత్రించేందుకే పట్టాదారు పాస్‌పుసకం నిబంధన విధించమన్నారు. కౌలు రైతులు తాము సాగు చేసుకుంటున్న భూమికి సంబంధించిన పట్టా జిరాక్స్ లేదా పట్టాదారు పేరు తెలియజేయాల్సి ఉంటుందని, పట్టాలు లేని రైతులు తాము సాగులో ఉన్నట్లుగా వ్యవసాఖాలో నమోదైతే యూరియా విక్రయిస్తున్నామని తెలిపారు. దీనికోసం విక్రయ కేంద్రం వద్ద ఏఈఓలకు బాధ్యతలు అప్పగించామని వివరించారు.